




మెదక్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద, కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు, సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ర్యాలీ

# మాదక ద్రవ్యాల నివారణకు కఠిన చట్టాలు

- ఆరోగ్యకర సమాజానికి పాటుపడుదాం
- మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జూన్ 26 : మాదక ద్రవ్యాల నివారణకు చట్టాలు కఠినంగా ఉన్నాయని, నార్కోటిక్ డ్రగ్స్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటారని జిల్లా ప్రధాన న్యాయాధికారి, లీగల్ సర్వీసెస్ చైర్‌పర్సన్ లక్ష్మీశారద తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం మెదక్ పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్, ఎస్పీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. రాందాస్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించి, ఆరోగ్యకరమైన సమాజానికి పాటుపడుదామని పిలుపునిచ్చారు. జిల్లాలో కల్లు బాగా విక్రయిస్తున్నారని, వాటిలోనూ మత్తు పదార్థాలు కలుపుతున్నారన్నారు. ఇది ప్రమాదకరమని, వ్యసనపరులు గుర్తించాలన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడి విలువైన నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ఎస్పీ బాలస్వామి, అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, జిల్లా సంక్షేమాధికారి బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుభాష్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

సంగారెడ్డి రూరల్, జూన్ 26 : అందరం కలిసి డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా జిల్లాలో డి-నాబ్ (జిల్లా నార్కోటిక్ అనాలసిస్ బ్యూరో)ను ఏర్పాటు చేశామన్నారు. మీ చుట్టూ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్, గంజాయి, మరే ఇతర మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నట్టు గుర్తిస్తే వెంటనే డి-నాబ్‌కు టోల్ ఫ్రీ నంబర్ 8712656777 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, యువతతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లబోమని, వాటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ కమిషనర్ నవీన్ చంద్ర, డీడబ్ల్యూవో లలితకుమారి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అల్లం రాజారెడ్డి, రత్నం, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ మార్కెట్‌కు జరిమానా

### కుళ్లిన పండ్లను విక్రయిస్తున్నందుకు చర్యలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 26: కుళ్లిన పండ్లను విక్రయిస్తున్న మెదక్ పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్‌కు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. బుధవారం కమిషనర్ జానకీరాంసాగర్ ఆదేశాల మేరకు ఆటోనగర్‌లోని మోర్ సూపర్ మార్కెట్‌లో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మహేష్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. కుళ్లిన పండ్లను గుర్తించగా నిర్వాహకులను పిలిచి నోటీసులు అందజేశారు. రూ.5వేల జరిమానా విధించి రశీదును ఇచ్చారు. ఈ తనిఖీలో వార్డు ఆఫీసర్లు నవీన్, శివ, మహబూబ్, దేవులయ్య, సిబ్బంది రాజశేఖర్ ఉన్నారు.



సూపర్ మార్కెట్‌లో విక్రయిస్తున్న కుళ్లిన యాపిల్ పండు

# చెరువు కట్టను తవ్వి ప్లాట్లుగా మార్చి

- రెచ్చిపోతున్న రియల్టర్లు
- దర్జాగా ఎర్రకుంట చెరువు స్థలం కబ్జా
- కట్టు కాల్వనూ వదలని వైనం

సంగారెడ్డి టౌన్, జూన్ 26 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో సర్కారు భూములతో పాటు చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయి. జిల్లాలో గుంట భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, ఇటీవల కలెక్టర్ క్రాంతి ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదేశించిన విషయం తెలిసిందే. అయినా రియల్టర్ల ఆక్రమణలకు అంతులేకుండా పోతుంది.





ఎర్రకుంట కట్టను తవ్వేసి తాత్కాలికంగా సిమెంటు పలకలతో ప్రహరీని ఏర్పాటు చేసిన రియల్టర్లు, ఇన్‌సెట్‌లో తవ్విన కట్ట

### ఎర్రకుంట కట్ట చదును

సంగారెడ్డి పట్టణంలోని 34వ వార్డు పరిధి రామచంద్రారెడ్డి నగర్-ఇందిరా కాలనీల మధ్య ఉన్న ఎర్రకుంట చెరువు కట్ట కబ్జాకు గురైంది. రాజంపేట నుంచి మల్కాపూర్ మధ్యలో రామచంద్రారెడ్డి నగర్ సమీపంలో ఉన్న ఎర్రకుంట కట్టను తవ్వేశారు. చదును చేసి ప్లాట్లుగా మార్చారు. తాత్కాలికంగా సిమెంటు పలకలతో ప్రహరీని సైతం నిర్మించారు. మల్కాపూర్ వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో భూములకు భారీగా డిమాండ్ ఉండటంతో ఎర్రకుంట కట్టను ఆక్రమార్కులు తవ్వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

### కట్టు కాల్వ సైతం ఆక్రమణ

కొంత మంది రియల్టర్లు ఓ వైపు ఎర్రకుంట కట్టను కబ్జా చేసి మరో వైపు ఆయకట్టుకు నీటిని తరలించే కట్టు కాల్వను సైతం ఆక్రమించారు. ఎర్రకుంట నుంచి చింతలపల్లి గ్రామ శివారులోకి వరద నీరు చేరేందుకు ఏర్పాటు చేసిన కాల్వను పూడ్చి ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నించగా ఇటీవల స్థానికులు అడ్డుకున్నారు. కాల్వకు సమీపంలో ఉన్న అపార్టుమెంటులోకి వరద నీరు వెళ్లేలా నాలాను మళ్లించడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులను నిలిపివేశారు.

### చర్యలు తీసుకుంటాం

ఎర్రకుంట కట్ట, నాలా కబ్జాపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పనులను నిలిపివేయించాం. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టం. శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. ఎర్రకుంట కట్టు కాలువను పూడ్చివేసి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. కట్టను తవ్వేసిన వారిపైనా చర్యలు తప్పవు.

\- బాలగణేష్, డీఈఈ ఇరిగేషన్

# నిమ్జ్ అభివృద్ధికి సహకరించాలి

- ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ అద్భుత ఆలోచన నిమ్జ్
- మిగతా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఝరాసంగం, జూన్ 26 : నిమ్జ్ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎల్గోయి, ముంగి గ్రామాలకు చెందిన నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టు ఏర్పాటు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ అద్భుత ఆలోచన అని అన్నారు. 2017-18లో మల్లన్నసాగర్ ముంపు బాధితులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించకుండా జీవో నంబరు 123 ప్రకారం ఇవ్వాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ నిర్వాసితులకు అండగా నిలబడిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత రైతులు కూడా కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని చెప్పిందన్నారు. 269 బాధితులకు సంబంధించి రూ.22 కోట్లు పరిహారం అందజేశామన్నారు. లీగల్ సలహాలు తీసుకుని మిగతా 900 ఎకరాలకుగాను వేయి మంది రైతులకు నష్టపరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిమ్జ్ ప్రాజెక్టు అభివృద్ధికి రూ.45 వేల నుంచి 50 వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా 2.50 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో 17 గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో భూసేకరణ చేపట్టనున్నామన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ భూములు కోల్పోయిన కొంత మంది రైతులకు నష్టపరిహారం రాలేదని, వారికి కూడా అందజేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన కోరారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రోడ్లు దెబ్బతిన్నాయని, ప్రజా రవాణాను బాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, ఉజ్వల్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీవో రాజు, ఎంపీపీ దేవదాస్, జడ్పీటీసీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నిమ్జ్ భూనిర్వాసితురాలికి చెక్కును అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరి క్రాంతి

## అదృశ్యమైన యువకుడు..
# సంపులో శవమై..

- మియాపూర్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు
- హత్యా.. ప్రమాదవశాత్తు పడి చనిపోయాడా?
- పోలీసుల అదుపులో మృతిడి స్నేహితులు



నితిన్(ఫైల్)

పటాన్‌చెరు, జూన్ 26 : మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో నీటి సంపులో శవమై దొరికిన సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ మియాపూర్ ప్రాంతంలోని పోగుల ఆగయ్యనగర్‌కు చెందిన నితిన్(26) ఆదివారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు మరుసటి రోజు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నితిన్ స్నేహితులు వెంకటేశ్‌తో పాటు కొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నితిన్ ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు పక్కన నిర్జనంగా ఉండే పాంచజన్యకాలనీలో పార్టీ చేసుకున్నట్లు తెలిసింది. దీంతో మియాపూర్ పోలీసులు అమీన్‌పూర్ పోలీసులకు యువకుడి మిస్సింగ్ సమాచారం ఇచ్చారు. నితిన్ స్నేహితులైన వెంకటేశ్ మరో 12 మంది యువకులను అమీన్‌పూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మొదట పొంతన లేని సమాధానాలు చెప్పగా, లోతుగా విచారించగా అసలు విషయం తెలిసింది. ఆదివారం రాత్రి నీటి ట్యాంక్ వద్ద పుట్టిన రోజు పార్టీ చేసుకున్న తరువాత నితిన్ సంపులో పడి చనిపోయాడని తెలిపారు. వారిని వెంటబెట్టుకుని పోలీసులు ట్యాంకు వద్దకు చేరుకున్నారు. నీటి సంపును పరిశీలించగా నితిన్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి సంగారెడ్డి ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

గతంలో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేసిన నితిన్ ప్రస్తుతం ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అదే కాలనీలో ఉండే వెంకటేశ్ ఆటో నడుపుతున్నాడు. వారు గంజాయి సేవించినట్లు తెలిస్తోంది. స్నేహితుల మధ్య వ్యక్తి గత పాత కక్షలతో ఘర్షణ పడ్డట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ప్రమాదవశాత్తు సంపులో పడి చనిపోయాడా? లేదా ఘర్షణలో దెబ్బలు తగిలి చనిపోయాడా అన్నది తేలాల్సి ఉంది. బర్త్‌డే పార్టీకి హాజరైన మిగతా వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. స్నేహితుడు ఆదివారం నుంచి అదృశ్యమైనా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు దాచాల్సి వచ్చింది అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

### ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

జహీరాబాద్, జూన్ 26 : జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని కలెక్టర్ వల్లూరి క్రాంతి బుధవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. సిబ్బంది, వైద్యుల హాజరుకు సంబంధించి బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలోని వార్డుల్లో తిరిగి రోగులను పలకరిస్తూ వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వైద్య సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్, వైద్యులు కిరణ్మయి, బాల్‌రాజ్, నాగరాజుపాటిల్, డా.శేషుబాబు, సిబ్బంది ఉన్నారు.

# చిరుప్రా(సా)యం..

### బాలింతకు కిడ్డీ బ్యాంకు డబ్బు ఇచ్చిన బాలిక



బాలింతకు తను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును అందజేస్తున్న చిన్నారి సాయిసవిర

నారాయణఖేడ్, జూన్ 26 : ఓ చిన్నారి తాను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును వితరణ చేసి మానవత్వాన్ని చాటుకున్నది. మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన భజరంగ్‌దళ్ కార్యకర్త ప్రశాంత్ ఇటీవల తన షాపులో ఫ్రిజ్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ప్రశాంత్ భార్య శ్రీవాణి అప్పటికే ఆరు నెలల గర్భిణి. ఆమె రెండు రోజుల క్రితం ప్రసవించింది. పేదరికంలో ఉండి వైద్య ఇతర ఖర్చులకు ఇబ్బంది పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న మనూరు మండలం బెల్లాపూర్‌కు చెందిన తొమ్మిదేళ్ల సాయిసవిర తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును ఆమెకు ఇస్తానని తన కుటుంబ సభ్యులకు తెలిపింది. సాయిసవిర తండ్రి శంకర్ తన కూతురును నారాయణఖేడ్‌కు తీసుకువచ్చి తాను దాచుకున్న రూ.4 వేలను శ్రీవాణికి అందజేసింది. ఈ సందర్భంగా సాయిసవిరను పలువురు అభినందించారు.

# పరిశ్రమలో కార్మికుడు మృతి

● కుటుంబీకుల ఆందోళన


కిరణ్ (ఫైల్)

హత్నూర/సంగారెడ్డి అర్బన్, జూన్ 26: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధి లోని గుండ్లమాచునూర్ శివారులోని ఎపి టోరియా యూనిట్-3 పరిశ్రమలో బుధ వారం విధులు నిర్వహిస్తూ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా రామన్నగూడెం గ్రామా నికి చెందిన గడిశాల కిరణ్ (34) కొన్నే ళ్లుగా ఈ పరిశ్రమలో పర్మినెంట్ ఉద్యోగి. రోజువారీగానే మంగళవారం రాత్రి విధులకు వెళ్లాడు. బుధవారం ఉదయం రిలీవర్ వచ్చి చూడగా.. కిరణ్ కుప్పకూలి ఉన్నాడు. వెంటనే తోటి కార్మికులకు చెప్పడంతో వారంతా వచ్చి.. అంబులెన్స్‌లో సంగారెడ్డి సమీపంలో ఎంఎన్ఆర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కిరణ్ చనిపో యినట్లు వైద్యులు నిర్ధారించారు.

**వాయువు లీక్ వల్లే.. : కుటుంబీకులు**

పరిశ్రమలో జరిగిన ఏదో ప్రమాదం, వాయువు లీక్ వల్లే కిరణ్ మరణించి ఉంటారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. విషయం బయటకు తెలియ కుండా ఉండేందుకే యాజ మాన్యం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించిందని అంటున్నారు. పర్మినెంట్ ఉద్యోగి అయిన కిరణ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయా పార్టీల నేతలు, కార్మిక సంఘాల ప్రతిని ధులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళనకు దిగారు. రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేది లేదని స్పష్టం చేశారు. దీంతో పరిశ్రమ ప్రతినిధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వారితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. చేసేదేమీ లేక పరిశ్రమ ప్రతి నిధులు అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నిం చగా.. కార్మికసంఘాల నాయకులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ కుటుంబంలో ఎవ రైనా చనిపోతే ఇలాగే వెళ్తారా..' అంటూ పరిశ్రమ ప్రతినిధులను నిలదీశారు. ఎక్స్‌గ్రేషియా ప్రక టించే వరకు ఇక్కడి నుంచి కదిలి లేదని వారు స్పష్టం చేశారు. స్పందించిన పరిశ్రమ యాజ మాన్యం మృతుడి కుటుంబానికి రూ.40 లక్షలు( పీఎఫ్, ఈఎస్ఐతో సంబంధం లేకుండా) ఇస్తా నని హామీ ఇచ్చింది. దీంతో ఆందోళన విరమిం చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు అతివేల మాణిక్, సీఐటీయూ జిల్లా నాయ కులు యాదగిరి, కాంగ్రెస్ హత్నూర మండల కార్యదర్శి జగన్ యాదవ్, ఉపాధ్యక్షుడు నర్సింహా రెడ్డి, శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు చెంచు శ్రీశైలం, ముత్యాలు పాల్గొన్నారు. చనిపోయిన కార్మికుడికి భార్య అర్చన, కూతుళ్లు సాయి అక్షయ, లాస్యలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుభాష్ తెలిపారు.


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

# వ్యవసాయ భూముల సర్వేపై శిక్షణ

● మా వల్ల కాదన్న కార్యదర్శులు

కంది, జూన్ 26: వ్యవసాయ భూముల సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. శిక్ష ణలో ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ మాట్లా డుతూ వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈ సర్వే అంతా మొబైల్ యాప్ ద్వారానే చేయాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్ వెంటనే మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని తాము సూచించిన గ్రామాల్లో సర్వేని ప్రారంభించాలని పంచాయితీ కార్యదర్శులను ఆయన కోరారు. అలాగే, హరిత హారం కింద గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనుల తీరు, మిషన్ భగీరథ సర్వేపై ఆరా తీశారు. అయితే, వ్యవసాయ భూముల సర్వే తమ వల్ల కాదని పంచాయతీ కార్యదర్శులు చేతు లెత్తేశారు. ఈ మేరకు వారు ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్ప టికే గ్రామాల్లో రోజువారీ పనులతో పాటు మిషన్ భగీరథ సర్వే, మరుగుదొడ్ల సర్వేలతో సతమతమ వుతున్నామని, కొత్తగా వ్యవసాయ సర్వే చేయలే మని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏవో ప్రసాద్, ఏపీవో గురు పాదం, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

# ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలి


దాబాలు, హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

కంది, జూన్ 26: కంది పరిధిలోని అన్ని హోటళ్లు, దాబాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని తహసీల్దార్ విజ యలక్ష్మి అన్నారు. కందిలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం దాబాలు, హోటళ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వచ్చే 15 రోజు లపాటు మాత్రమే పంచాయతీ సిబ్బంది చెత్తను సేకరిస్తారన్నారు. ఆపై దాబాల వద్దనే తడి, పొడి చెత్తలను వేరుచేసుకుని ఎరువుగా మార్చుకోవాలని సూచించారు. అందుకు అనువుగా దాబాల ఆవరణలో గుంతలను తవ్వకుని తడి చెత్తను, మిగిలి పోయిన ఆహార పదార్థాలను వేసి వర్మీ కంపోస్టును తయారు చేసుకోవాలని సూచించారు. అలాకాకుండా ఆరుబయట ఎక్కడబడితే అక్కడ దాబాల్లోని చెత్తను, మిగిలిపోయిన ఆహార పదార్థాలను పార బోస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పంచాయితీ అధి కారి మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్య దర్శి విద్యాధర్ గౌడ్, దాబాలు, హోటళ్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన అజ్మత్‌పాష, అజ్మత్‌పాష(ఫైల్)

జహీరాబాద్, జూన్ 26: మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందాడు. చిరాగ్‌పల్లికి చెందిన అజ్మత్‌పాష(24) జహీరాబా ద్‌లో మొబైల్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం దుకాణాన్ని తెరిచేందుకు మండలంలోని సత్వార్ గ్రామం వద్ద గల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా బైక్‌పై జహీరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న క్రమంలో అజ్మత్‌పాష మృతిచెందాడు. మృతుడి కుటుంబస భ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు


చిల్కేపల్లికి వెళ్లే ప్రధాన తారు రోడ్డు పక్కనే పాతిన విద్యుత్ స్తంభాలు

కోహీర్ జూన్ 26: మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామ శివారులో గల 89వ సర్వేనెంబర్ ప్రాంతంలోని ఝరాసంగం మండలం చిల్కేపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన తారు రోడ్డు పక్కనే 33/11 కేవీ విద్యుత్ స్తంభాలను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. హైవోల్టేజ్ గల విద్యుత్ స్తంభాలను తారు రోడ్డు పక్కనే పాతడం వల్ల వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఆ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు రోడ్డు పక్కన ఉన్న వేపచె ట్లను నరికివేశారు. ఓ ప్రైవేట్ స్టీల్ కంపెనీ కోసం చెట్లను నరకడంపై దిగ్వాల్, చిల్కేపల్లి గ్రామస్థులు విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులపై మండిపడుతున్నారు. ఈ విష యమై విద్యుత్‌శాఖ కోహీర్ మండల అధికారిని వివరణ కోరగా.. ఎక్కడ పాతినా ఏమీ కాదని బాధ్యతారహితంగా మాట్లాడడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారం స్పందించి రోడ్డు పక్కనే పాతిన స్తంభాలను తొలగించి రోడ్డుకు దూరంగా పాతాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# చేయి.. చేయి కలిపారు.. రోడ్డు వేసుకున్నారు..


కల్హేర్ మండలంలోని ఫత్తేపూర్‌లో పొలాలకు రోడ్డు

కల్హేర్, జూన్ 26: ఆ ఊరి వారందరి పంట పొలాలు అక్కడే ఉన్నాయి. కానీ, అక్కడి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గమే లేదు. దీంతో ఆ రైతులంతా ఒక్కట య్యారు. ఎవరో వస్తా రని ఎదురుచూడకుండా తలో చేయి వేసి.. తమ పంట పొలాలకు రోడ్డు వేసుకున్నారు. మండ లంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన పలు వురు రైతులకు చెందిన సుమారు 250 ఎకరాల భూములకు సరైన రహదారి సౌకర్యం లేక పోవడంతో రైతులంతా రోడ్డు వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సుమారు రెండు కిలోమీ టర్ల రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఎకరాకు రూ. 250 చొప్పున వేసుకుని.. మట్టి రోడ్డు వేసుకుని ఆదర్శంగా నిలిచారు.

# మంజీరాలో దూకి మహిళ ఆత్మహత్య

కొల్చారం, జూన్ 26: నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ బుధవారం ఏడుపాయల మొదటి బ్రిడ్జి వద్ద మంజీరానదిలో శవమై తేలింది. కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మాసపేట మండలం ఇసోజీగూడెంకు చెందిన వడ్డెర రవి, భార్య దేవకి, తల్లి అండాలు బతుకుదెరువు కోసం కొల్చారం మండలం పోతంశెట్‌పల్లికి వచ్చారు. ఈ నెల 22న పని విష యంలో తల్లీకొడుకులు గొడవ పడ్డారు. అదే రోజు సాయంత్రం అండాలు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టుప క్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం ఏడుపాయల మొదటి బ్రిడ్జి వద్ద మంజీరాలో మహిళ మృత దేహం కనిపించగా, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రవిని పిలిపించి చూపించగా, తన తల్లి మృతదేహంగా గుర్తించాడు. ఆమె ఇంటి నుంచి బయటికి వచ్చిన రోజే నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తు న్నారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, హనుమాన్ బండల్ సమీపంలో ఖననం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ;;

# ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి!

● నేడు విధుల్లో చేరాలని ఆదేశాలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 26: ఉపాధ్యాయ బదిలీ, పదోన్న తుల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా జడ్పీ యాజమాన్య పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసి స్టెంట్లుగా పదోన్నతి పొందేందుకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ఎస్ఏలుగా పదోన్నతి ఉత్తర్వులు బుధవారం రాత్రి వెలువడనున్నాయి. ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు గురువారం విధుల్లో చేరాలని అధికారులు స్పష్టం చేశారు. కాగా నేటి నుంచి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ఎస్జీటీల బదిలీ ప్రక్రియ ప్రారంభం కానున్నది.

# అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

చేగుంట, జూన్ 26 : పంటలపై ఎన్నో ఆశలతో అప్పులు తెచ్చి సాగు చేసిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివునూర్‌లో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన చింతల సత్తయ్య (52)కు రెండెకరాల భూమి ఉంది. పంటల సాగు కోసం అప్పులు చేశాడు. ఓ వైపు పంటల దిగుబడి సరిగా రాకపోవడం, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ తరుణంలో అప్పులు తీర్చే మార్గం కనిపించక జీవితంపై విరక్తితో బుధవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

# పట్టా భూములకు రక్షణ కల్పించండి

● తహసీల్దార్‌కు రైతుల వినతి

మాసాయిపేట, జూన్ 26: పట్టా భూములకు రక్షణ కల్పించండని అక్కం పేట రైతులు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వివరా ల్లోకి వెళ్తే.. అక్కంపేట పరిధిలోని 161 సర్వే నంబర్లు గల తమ వ్యవసాయ పట్టా భూమిని పక్కనే గల కొందరు బడా నాయకులు కబ్జాలకు పాల్ప డుతూ పంటలను సైతం చెడగొడుతున్నారని గ్రామానికి చెందిన ప్రసన్నకు మారి అనే మహిళా రైతు కుటుంబసభ్యులతో కలిసి తహసీల్దార్ జ్ఞానజ్యోతికి విన్నవించారు. పట్టా పాస్ బుక్, ధరణి రికార్డులలో తమ పేరుపై భూమి ఉన్నదన్నారు. అయితే కొందరు బడా నాయకులు రెండురోజులుగా ట్రాక్టర్లతో దున్నుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు సర్వే నిర్వ హించి, తమ భూమిని కాపాడాలని వేడుకున్నారు.



సంగారెడ్డి అర్బన్: మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



నర్సాపూర్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మనోహరాబాద్ కాళ్లకల్ గ్రామంలో మానవహారంగా నిలబడిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

# మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా రెండూ నేరమే

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్
- పలు మండలాల్లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

సంగారెడ్డి అర్బన్, జూన్ 26: మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా రెండూ నేరమేనని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వాటి నుంచి తప్పించుకోవడం అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**పుల్‌కల్:** డ్రగ్స్ వినియోగం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ అన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, మద్య నిషేధ ఆబ్కారీశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

●**నారాయణఖేడ్:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

●**జిన్నారం:** మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులలో సీఐ సుధీర్ కుమార్, ఎస్ఐ విజయ్‌రావు, బొల్లారంలో మోడల్ పాఠశాల విద్యార్థులకు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

●**జహీరాబాద్:** అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో సీఐ రాజబోయిన రవి ఆధ్వర్యంలో విద్యార్థులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు.

**మెదక్ జిల్లాలో**

తూప్రాన్, జూన్ 26: తూప్రాన్ పట్టణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో హైస్కూల్ నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో జయచంద్రారెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి, కమిషనర్ ఖాజామొహిజుద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్‌లో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాలను అరికట్టేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో కలిసి ప్రధాన చౌరస్తా వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జాన్‌రెడ్డి మాట్లాడారు. ఎస్ఐ పుష్పరాజ్‌పాల్గొన్నారు.

●**పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

●**హవేళిఘణపూర్:** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

●**వెల్దుర్తి:** మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఎస్ఐ నవతాగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెల్దుర్తి అంబేడ్కర్ చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు.

●**రేగోడు:** మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం రేగోడు మోడల్ పాఠశాల నుంచి గాంధీ చౌక్ వరకు ఎస్ఐ రాజయ్య విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు.

●**టేక్మాల్:** టేక్మాల్ మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల నుంచి టేక్మాల్ చౌరస్తా వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మురళి, ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

●**నిజాంపేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే గ్రామంలోని పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్ఞానమాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

●**రామాయంపేట:** మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కావొద్దని పోలీస్, ఎక్సైజ్ సీఐలు వెంకటరాజాగౌడ్, రాణి సూచించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## సమాచారం

### 'బండి'ని కలిసిన నాయకులు

నర్సాపూర్, జూన్ 26: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌ను నర్సాపూర్‌కు చెందిన మాజీ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ వాల్దాస్‌మల్లేశ్ గౌడ్ ఢిల్లీలో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### కంటి వైద్య శిబిరం విజయవంతం

హత్నూర: హత్నూర గ్రామంలో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ, శంకర కంటి ఆసుపత్రి నానకరంగూడ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శివశంకర్‌రావు తెలిపారు. 387 మంది కంటి పరీక్షలు చేసుకోగా.. 45 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించినట్లు తెలిపారు.

### దారిని కాపాడండి: రైతులు

జహీరాబాద్: మండలంలోని బూచనెల్లి-తూంకుంట గ్రామాల మధ్యలో గల పొలాలకు వెళ్లే బాట(దారి)ని కొందరు దున్నేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు బుధవారం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

### ముగిసిన శిక్షణ

మనూరు: నూతన విద్యా విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల కేంద్రమైన మనూరులో నిర్వహించిన మూడురోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో సుజాత మాట్లాడారు.

### నోట్ పుస్తకాలు పంపిణీ

గుమ్మడిదల: గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన మైత్రీ ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ జిల్లా నాయకులు చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా నల్లవల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, గుమ్మడిదల గ్రామపంచాయతీ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.

### ఘనంగా ఆరాధనోత్సవాలు

రేగోడు, జూన్ 26: మర్పల్లి గ్రామంలోని విఠలేశ్వర ఆలయంలో ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గోపాల్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో కాల ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పండరీపూర్ భక్తులు పాల్గొన్నారు.

## పత్రికా ప్రకటన

తేది: 26.06.2024

ఇందుమూలముగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయునది. ఏమనగా నా క్లయింట్స్. **ఆర్. రాంచెంద్రారెడ్డి, ఐట్టి రాజా గౌడ్ గార్లు** సర్వే నం. 890/5. విస్తీర్ణం 5=00 ఎకరాలు సర్వే నం. 890/5/1లో గల విస్తీర్ణం 5=00 ఎకరాలు మొత్తం విస్తీర్ణం 10=00 ఎకరాలు మెదక్ శివారులో గల పిల్లికొట్టాల ప్రాంతంలోని భూమిపై గౌరవ జిల్లా జడ్జి మెదక్ కోర్టులో O.S నం. 09/2024 కేసు జి.నర్సారెడ్డి పై ఫైల్ చేయడం జరిగింది. కావున పై భూమిపై ఎలాంటి లావాదేవీలు జరిపిన చెల్లనేరవు.

సం/- ఎస్.చెంద్రారెడ్డి
అడ్వకేట్, మెదక్
మొబైల్ నం. 7989094347
H.No.1-12-24/ఎ/36/101
ఇందిరపురి కాలనీ, పాత ఆర్‌టిఏ కార్యాలయం సమీపాన
మెదక్-502110

## ఏరియా ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఫైర్

- బయటపడిన సిబ్బంది నిర్లక్ష్యం
- విధులకు గైర్హాజరైన వైద్యులు, సిబ్బంది



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 26: నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. బుధవారం వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో, వైద్యులు, సిబ్బంది ఎలాంటి సెలవులు పెట్టకుండా డుమ్మాలు కొట్టిన విషయం బట్టబయలైంది. రోగులకు శానిటేషన్ సిబ్బంది డ్రెస్సింగ్ చేయడం చూసి ఎమ్మెల్యే విస్తుపోయారు. దీనికితోడు డుమ్మాలు కొట్టిన కొంతమంది సిబ్బందికి వంతపాడడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. స్థానికంగా విధులు నిర్వహించాల్సిన ఫార్మాసిస్టులు, ఇతర వైద్యశాలలకు డిప్యూటేషన్ వేయించుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి వైద్యశాలను మొత్తం తిరిగి పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు సేవలందిస్తూ బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఇలా డుమ్మాలు కొట్టడం, ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్, ఆర్ఎంవో సైతం విధులకు గైర్హాజరవడం ఏంటని ప్రశ్నించారు. డెంటిస్టు అయిన ఆర్ఎంవో 19న సెలవుపై వెళ్లినట్లు రికార్డుల్లో ఉండగా, 26వ తేదీవరకు అడ్వాన్స్‌గా సీఎల్ వేసి ఉందన్నారు. ఫార్మాసిస్టు భీంరావు స్థానికంగా జాయిన్ అయిన కొన్నేళ్ల నుంచి సదాశివపేటకు డిప్యూటేషన్‌పై వెళ్లారని, ఇతను ఒక్కసారి కూడా ఖేడ్‌లో విధులు నిర్వహించలేదని, వెంటనే అతడిని సరెండ్ చేయాలని సూచించారు. మరో ఫార్మాసిస్టు శ్యాంరావు జోగిపేటకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ సంగారెడ్డికి ఫోన్ ద్వారా వివరించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు నర్సింహులు, వివేకానంద్, సవితహన్మండ్లు, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉన్నారు.



కేసీఆర్‌తో ఎమ్మెల్యే సునితారెడ్డి, ఎంపీపీ నర్సింహులు, నాయకులు

## కేసీఆర్‌ను కలిసిన ఎంపీపీ

హత్నూర, జూన్ 26: హత్నూర ఎంపీపీ నర్సింహులు ఆధ్వర్యంలో మండలానికి సంబంధించిన ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఎమ్మెల్యే సునితారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ నర్సింహులుతో పాటు బీఆర్ఎస్ ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, ఆయా గ్రామాల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిశారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, ఉద్యమం కొత్త కాదని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా కల్పించినట్లు వారు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో హత్నూర మండల యువత అధ్యక్షుడు కిషోర్, దౌల్తాబాద్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్ అలీ, నాయకులు ఉన్నారు.

## రాత్రికిరాత్రే బదిలీ

- వచ్చి ఐదు నెలలు కాకముందే..
- భగ్గుమంటున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్, జూన్ 26: తూప్రాన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రెడ్డబోయిన కృష్ణను రాత్రికిరాత్రి బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. రంగ కృష్ణను తూప్రాన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించడం, రాత్రికిరాత్రే బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయింది. ఇదంతా రాష్ట్రంలో అకస్మాత్తుగా జరుగుతున్న రాజకీయాల్లాగా కనిపిస్తుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం తూప్రాన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రెడ్డబోయిన కృష్ణ జనవరి 30న బాధ్యతలు స్వీకరించారు. అధికార కాంగ్రెస్ నాయకుల సమ్మతితోనే సీఐగా బదిలీపై వచ్చినట్లుగా చెబుతున్నారు. ఐదునెలలు గడవకముందే కృష్ణను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆయన కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా ఎలాంటి పనిచేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. అయితే రాత్రికి రాత్రి రంగ కృష్ణను తూప్రాన్ సీఐగా నియమించడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తుంది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ సీఐగా పనిచేస్తున్న రంగ కృష్ణ పార్లమెంట్ ఎన్నికల ముందు నర్సాపూర్ సీఐగా బదిలీ అయ్యారు. నెలరోజులు పనిచేయగానే బదిలీ చేశారు. ప్రస్తుతం ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేసిన రంగ కృష్ణ జిల్లా మంత్రి సహకారంతో తూప్రాన్ సీఐగా నియమాకమయ్యారు. ఈనెల 22న ఐజీ రంగనాథ్ జారీచేసిన ఆదేశాల్లో మెదక్ పట్టణ, మెదక్ రూరల్ సీఐలకు బదిలీ జరిగాయి. తూప్రాన్ సీఐ బదిలీ కోసం మంగళవారం ప్రత్యేకంగా ఆదేశాలుజారీ చేసినట్లు సమాచారం. ఆదేశాలు రావడంతోనే రాత్రికిరాత్రి తూప్రాన్‌కు విచ్చేసిన రంగకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయంలో గజ్వేల్, నర్సాపూర్ నాయకులు గుస్సాగా ఉన్నట్లు తెలిసింది. తమకు సమాచారం లేకుండా కృష్ణను బదిలీ చేయడం, రంగ కృష్ణను నియమించడంపై గుర్రుమంటున్నారు. ఓ నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏకంగా ఐజీ కార్యాలయానికి వెళ్లి బదిలీ విషయంలో ఆగ్రహించినట్లు సమాచారం.



నూతన సీఐగా బాధ్యతలు తీసుకుంటున్న రంగ కృష్ణ

## బిల్లుల ఆదాకు సోలార్ విద్యుత్



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంపై సోలార్ విద్యుత్‌కు భూమిపూజ చేస్తున్న దృశ్యం

తూప్రాన్, జూన్ 26: మున్సిపాలిటీలో బిల్లుల ఆర్థిక భారం తగ్గించుకోడానికి సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంపై రూ.20.68 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్‌కు, రూ.1.15 కోట్లతో 10వ వార్డులో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు శంకుస్థాపన చేశారు. 12వ వార్డు మహంకాళి ఆలయం వద్ద సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. సోలార్ విద్యుత్‌తో మున్సిపాలిటీపై భారం తగ్గుతుందన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి సెగ్రియేషన్ చేసేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, భాణాపురం రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌గుప్తా పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు నేరుగా లబ్ధిదారులకు పంపించాలి: భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎం.భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 26: తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారులకు పంపించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. బుధవారం నారాయణఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖేడ్ నియోజకవర్గానికి సంబంధించి 1,200 మంది సీఎం సహాయనిధి దరఖాస్తులను అందించినా.. ఎన్నికల కోడ్ రావడంతో వాటిని అప్పట్లో నిలిపేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని మార్చి నేరుగా లబ్ధిదారులకు పంపిస్తామని చెప్పి, కొందరికే పంపించి, మిగతావి ప్రస్తుత ఎమ్మెల్యేకు పంపించారన్నారు. వెంటనే ఆ చెక్కులను ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నజీబ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరశురాం, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్, మండల కోఆప్షన్ సభ్యుడు నవాబ్ పాల్గొన్నారు.

## అంబులెన్స్‌ను తనిఖీ చేసిన ప్రోగ్రాం అధికారి

నారాయణఖేడ్, జూన్ 26: జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్, జిల్లా మేనేజర్ హుస్సేన్ నారాయణఖేడ్‌లోని అంబులెన్స్ వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సంఘటనా స్థలాలకు చేరుకొని క్షతగాత్రులకు వైద్యమందించే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి వెంట అంబులెన్స్ ఈఎంటీ గురప్ప, పైలెట్ రవీంద్ర, తదితరులు ఉన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి: ఎంపీపీ

వెల్దుర్తి, జూన్ 26: ప్రభుత్వ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక ఆర్యోగ కేంద్రాన్ని ఎంపీపీ ఆకస్మికంగా సందర్శించి, పలు రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని వైద్యులు సౌజన్యకు సూచించారు. అలాగే వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, బాలుర వసతి గృహాన్ని, సందర్శించి అసహనం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వండిన కూరల్లో నాణ్యత లేకపోవడంతో పాఠశాల ఎస్‌వో ఫాతిమాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఇంటర్‌లో అనుకున్న ఫలితాలు రాలేదని, ఈసారి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎంపీపీ సూచించారు. బాలుర వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉండగా.. ఒకరికి 50 గ్రాముల చొప్పున మెనూ ప్రకారం శనిగలు అందించాలి. కానీ 60 మంది విద్యార్థులకు 1500 గ్రాములను పెట్టడం ఏమిటని వసతి గృహ వార్డెన్ శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మండల పరిధిలోని మనేపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించగా వారిని ఎంపీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ

## రైతుల ఖాతాలను హోల్డ్ చేయడం సిగ్గుచేటు: సీపీఎం

సంగారెడ్డి రూరల్, జూన్ 26: రైతుల ఖాతాలను హోల్డ్ చేయడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం విమర్శించారు. సంగారెడ్డిలోని లీడ్ బ్యాంకు జిల్లా కార్యాలయం వద్ద బుధవార సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న బ్యాంకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. పీఎం కిసాన్, పంటలు అమ్మిన డబ్బులు, పెన్షన్లకు సంబంధించిన డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడినా.. వాటిని తీసుకోకుండా బ్యాంకు అధికారులు హోల్డ్ చేయడం దారుణమన్నారు. రైతుల బ్యాంకు హోల్డ్‌లను తొలగించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహులు, రాజయ్య, నర్సింహారెడ్డి, రమేష్ గౌడ్, కృష్ణ, దత్తు, సంజీవ్ పాల్గొన్నారు.

## కారు బోల్తా, నలుగురికి గాయాలు



బోల్తాపడిన కారు

రామాయంపేట, జూన్ 26: కారు బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన బాబురావు, లావణ్య, జమున, సాత్విక్ బుధవారం పని నిమిత్తం ఆర్మూర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో రామాయంపేట హైవేపై వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు



రైల్వేస్టేషన్‌లో ఉన్న బాలుడు

చేగుంట, జూన్ 26: మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడిని బుధవారం వదిలివెళ్లారు. స్టేషన్ మాస్టర్, రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. కాచిగూడ నుంచి మెదక్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఎస్-9 కోచ్‌లో 15 నెలల బాలుడిని ఎవరో వదిలేసి వెళ్లారు. బాలుడు బోగిలో రోదించడంతో గుర్తించిన ప్రయాణికులు స్టేషన్ మాస్టర్ నవీన్‌కు చెప్పారు. ఆయన కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారమందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కామారెడ్డి పోలీసులు బాలుడిని బాల సంరక్షణ జిల్లా అధికారులు అశోక్, మంజుల, రమేష్‌కు అప్పగించారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయం లేదా రైల్వే పోలీసులు 8712658614, 9703217723 నెంబర్లలో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ తావునాయక్ తెలిపారు.

## జిల్లెల వాగు వద్ద వ్యర్థాల సేకరణ సంపు సామర్థ్యం పెంచాలి



ఆందోళన చేస్తున్న స్థానికులు

జిన్నారం, జూన్ 26: కాజీపల్లి పరిధిలోని పరిశ్రమల రసాయనాల వ్యర్థాల సేకరణకు ఏర్పాటు చేసిన సంపు సామర్థ్యం పెంచాలని స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం కాజీపల్లికి చెందిన పలువురు నాయకులు పారిశ్రామికవాడలోని జిల్లెలవాగుపై ఏర్పాటుచేసిన సంపును పరిశీలించారు. పీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంపు సామర్థ్యం సరిపోక వ్యర్థాలు చేరి దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తున్నాయని, దీంతో సమీపంలోని చెరువులు, కుంటలు, బహిరంగ ప్రాంతాలు, కాలుష్య వ్యర్థాలతో నిండుతున్నాయని నాయకులు రమాకాంత్, కుమార్‌యాదవ్‌లు తెలిపారు. కాగా కాలుషిత జలాల తీరుపై ప్రైవేటు సంస్థలతో శాంపిల్స్ సేకరించి, నివేదికను న్యాయస్థానాలకు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, ఎండీ.హుస్సేన్, భరత్, కిరణ్‌కుమార్, మహదేవ్, అభిమన్యు పాల్గొన్నారు.

## మెగా ప్లాంటేషన్ కోసం స్థల పరిశీలన

పెద్దశంకరంపేట, జూన్ 26: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా త్వరలో చేపట్టనున్న మెగా ప్లాంటేషన్ గురించి పెద్దశంకరంపేట శివారులోని స్థలాన్ని జిల్లా ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శరత్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసాలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టేందుకు గుంతలు తీసే పనులు చురుకుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో నవాజుద్దీన్, టీఏలు రమేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పోచారం రాములు



రాములుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న గోదావరిఅంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూన్ 26: బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా పోచారం రాములు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోచారం రాములు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని రాములు స్పష్టం చేశారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

సంగారెడ్డి క్రైం, జూన్ 26: మృతిచెందిన కానిస్టేబుల్ యాదగిరి కుటుంబానికి అతని బ్యాచ్‌మేట్స్ రూ.2లక్షల 16వేల 324 చెక్కును అందజేశారు. 2013లో సంగారెడ్డి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన యాదగిరి గత మేలో అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. 2013 బ్యాచ్‌కు చెందిన సహచర ఉద్యోగులు రూ.2,16,324 చెక్కును మృతుని భార్య శ్రీవిద్య, కొడుకు హర్షిత్‌లకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ చేతులమీదుగా అందజేశారు.

## శిఖం భూమిని కబ్జా చేస్తే చర్యలు

- ఇరిగేషన్ డీఈఈ రాజేందర్

వెల్దుర్తి, జూన్ 26: చెరువు, కుంటల శిఖం భూములను కబ్జాచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈఈ రాజేందర్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్‌లో ఆర్ఐ జయభరత్‌రెడ్డితో కలిసి గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. గ్రామ పరిధిలోని పలు చెరువు, కుంటల శిఖం భూములు కబ్జా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, శిఖం కబ్జాపై సోమవారం సర్వేలు చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ గ్రామసభలో ఇరిగేషన్ ఏఈ కవిత, సర్వే యాదగిరిగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దుర్తి, జూన్ 26: హల్దీవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవతాగౌడ్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున మేల్లూరు హల్దీవాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, సంబంధిత వాహన యజమాని నరేందర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

## సేవలే గుర్తింపునిస్తాయి: నోడల్ అధికారి

పెద్దశంకరంపేట, జూన్ 26: ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలు అనంతరం గుర్తింపు ఇస్తాయని పెద్దశంకరంపేట మండల విద్యాశాఖ నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. బుధవారం పేట మండల పరిధిలోని చీలపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఆసూరి రామచంద్రచారి వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే జీవితానికే సార్థకత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీజీ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది రాజేశ్వర్‌రావు, సుభాష్, వేణు, శంకర్, శ్రీనివాస్, మారుతి, గోపి ప్రసన్న పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

కంది/కొండాపూర్, జూన్ 26: కంది ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మండలంలోని 22 గ్రామాలకు చెందిన కార్యదర్శులు కలిసి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల మండలాధ్యక్షుడిగా బ్యాతోల్ కార్యదర్శి ఎల్.సుభాష్, ఉపాధ్యక్షుడిగా చిద్రుప్ప, కార్యదర్శిగా ఆర్.అశోక్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎర్దనూర్ కార్యదర్శి జి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీగా కాశీపూర్ కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారిగా మామిడిపల్లి కార్యదర్శి శ్రీధర్‌స్వామి, ఈసీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. అలాగే కొండాపూర్ పంచాయతీ మండలాధ్యక్షుడిగా కిశోర్‌ను రెండోసారి ఎన్నుకున్నారు.

## పాఠశాలల బంద్ విజయవంతం

సంగారెడ్డి అర్బన్/పెద్దశంకరంపేట/కంగ్టి/నారాయణఖేడ్/కల్హేర్/చేగుంట, జూన్ 26: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల బంద్ బుధవారం విజయవంతమైంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఏబీవీపీ నాయకులు పాఠశాలలు తిరుగుతూ తరగతులు బహిష్కరింపజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాజు, నగర కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేట, కంగ్టి, నారాయణఖేడ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలను బంద్ చేయించారు. కల్హేర్, సిర్గాపూర్, చేగుంట, నిజాంపేట మండలాల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది.